క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేకాలంకరణ



బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మంగళవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి భారీఎత్తున భక్తులు తరలి వచ్చి, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

సొసైటీల్లో వరి విత్తనాల విక్రయాలు

తాళ్లపూడి: రైతుల ఖరీఫ్ వరి సాగుకు అవసరమైన వరి విత్తనాలు మండలంలోని అన్ని సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. మండలంలోని అన్నదేవరపేట, రాగోలపల్లి, తాడిపూడి, మలకపల్లి సొసైటీల్లో రైతులు తమకు అవసరమైన వరి విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. అంతే కాకుండా తాళ్లపూడిలో కూడా ప్రత్యేకంగా మార్టేరు వారి ఆధ్వర్యంలో వరి విత్తనాలు విక్రయిస్తున్నార న్నారు. 30 కిలోల వరి విత్తనాల ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి. పీఎల్ -1100 రకం రూ.1185, 1318 రకం రూ.990, 1061 రకం రూ.1180, స్వర్ణ- 7029 రకం రూ.1200, సంపద గోల్డ్ -9558 రకం రూ.1700 రేటుకు విక్రయించనున్నట్లు ఏవో వివరించారు.

డంపింగ్ యార్డులా హండ్రెడ్ ఫీట్ రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి నుంచి ఎండోమెంట్ వాంబే కాలనీ మీదుగా నిర్మించిన హండ్రెడ్ ఫీట్ రోడ్డు డంపింగ్ యార్డులా మారిపోయింది. ఆ రోడ్డులో వాహన చోదకులతో పాటు ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకర్లు నడుస్తారు. అయితే ఈ రోడ్డు పక్కనే పేరుకుపోతున్న చెత్తాచెదారాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో పలు చోట్ల నుంచి బిల్డింగ్ వ్యర్థాలతో పాటు చెత్తను తీసుకువచ్చి ఈ రోడ్డు పక్కనే డంపింగ్ చేస్తున్నారు. వాటి కారణంగా ఆ ప్రాంతం చిన్న డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఈ విషయాన్ని నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ధర్మారెడ్డి కోరుతున్నారు.

7 నుంచి అమ్మవార్ల జాతర

చాగల్లు: మార్కొండపాడు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ వారి జాతరను ఈ నెల 7వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గత నెలలో అమ్మవార్లను నడి వీధిలోని పూరి గుడిసెలోకి తీసుకు వెళ్లారు. అప్పటి నుంచి పూరిగుడిసె వద్దే పూజలు నిర్వహిస్తున్నారు. పన్నెండేళ్ల కోసారి నిర్వహించే అమ్మవార్ల జాతర రోజుల్లో గ్రామం అంతా సందడి నెలకొంటుంది. అమ్మవారి ఆశీస్సుల కోసం పరిసర గ్రామల నుంచి కూడా భక్తులు భారీగా వస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఈ నెల 7న అమ్మవార్ల సేవ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించనున్నారు. 8న బలి చేట, 9న అమ్మవారికి నైవేద్యాల సమర్పణ తదితర కార్యక్రమాలు జరుగుతాయి.

కూటమి అభ్యర్థుల విజయం

- అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- రాజానగరంలో బత్తుల గెలుపు

పెదపూడి/అనపర్తి: గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ఫలితాల్లో అనపర్తి నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీ చేసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 20,567 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. నియోజకవర్గంలో సుమారు 2,26,053 ఓట్లు ఉండగా, మొత్తం 1,94,962 ఓట్లు పోలయ్యాయి. రాజానగరంలోని నన్నయ యూనివర్సిటీ ఎన్-బ్లాక్‌లో ఈ ఓట్లను 17 రౌండ్లలో లెక్కింపు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. తొలి రౌండ్లో డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి 114 ఓట్ల మెజార్టీ రాగా, రెండో రౌండ్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి 81 ఓట్లు ఆధిక్యత వచ్చింది. 3వ రౌండ్‌లో 359, 4వ రౌండ్‌లో 846 ఓట్లతో సూర్యనారాయణరెడ్డి ముందంజలో ఉన్నారు. కాగా 5వ రౌండ్ వచ్చేసరికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 927 ఓట్లు ఆధిక్యత లభించాయి. అలాగే మిగిలిన రౌండ్లు స్వల్ప ఆధిక్యత చూపిస్తూ 12వ రౌండ్‌లో రామకృష్ణారెడ్డి 2,864 మెజార్టీ సాధించారు. చివరిగా 17వ రౌండు పూర్తయ్యే సమయానికి 20,567 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం ఎన్నికల అధికారులు ఆయనకు ధ్రువపత్రాన్ని అందజేశారు.

ఇలాఉండగా అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 9 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు, వై.శ్రీనివాసారావు(ఇండియన్ కాంగ్రెస్ పార్టీ), కె.శ్రీనివాసు(బీఎస్పీ), కె.శివానంద్‌రెడ్డి అఖిల్ (భారతీయ జన్‌సంఘ్), గంగాధర్ లింగం (జైభీమ్‌రావు భారత్), ఎస్‌కే సర్దార్ హుస్సేన్ (లిబిరేషన్ కాంగ్రెస్), సీహెచ్ శ్రీను, పిసరెడ్డి (స్వతంత్రులు) పోటీలో నిలిచారు. నియోజకర్గంలోని నాలుగు మండలాల్లో ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం మెజార్టీ వివరాలు ఇలా ఉన్నాయి.



ఆర్వో నుంచి ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న అనపర్తి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి మండలంలో వైఎస్సార్ సీపీకి 361 మెజార్టీ రాగా, బీజేపీకి బిక్కవోలు మండలం 3,689, పెదపూడి మండలం 7,589, రంగంపేట మండలం 9,650 ఓట్ల మెజార్టీ లభించింది.

భారీ పోలీసు బందోబస్తు

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రధానంగా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట. పెదపూడి మండల కేంద్రాల్లో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పెదపూడి మండలంలో ఎస్సై శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో జి.మామిడాడ, శిరపురం, రామేశ్వరం, పెద్దాడ తదితర గ్రామాల్లో పోలీసులు, పారా మిలటరీ, ప్రత్యేక పోలీసు బలగాల వారు పహారా కాస్తున్నారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కొలువైన శ్రీలక్ష్మీ గణపతి ఆలయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని, పూజలు చేశారు.

రాజానగరంలో జనసేన విజయకేతనం

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ 34,049 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి మెజార్టీని అందుకుంటూ వచ్చిన ఆయనకు 1,05,995 ఓట్లు లభించగా, ప్రత్యర్థిగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు 71,946 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం నుంచి మొత్తం 1,90,938 ఓట్లు పోలవగా, వీటిలో ఈవీఎంల ద్వారా 1,89,503 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు 1,435 ఉన్నాయి. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం 16 రౌండ్లలో జరిగిన లెక్కింపులో బత్తులకు ఈవీఎంల ద్వారా 1,05,111 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్స్ ద్వారా 882 ఓట్లు వచ్చాయి. అలాగే జక్కంపూడి రాజాకు ఈవీఎంల ద్వారా 71,439 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్స్ ద్వారా 507 ఓట్లు లభించాయి. ఇక మిగిలిన అభ్యర్థులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మండూరి వెంకట శ్రీనివాస్‌కు 1,901, రాష్ట్రీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొత్తపల్లి భాస్కరరామ్‌కు 1,709, బీఎస్పీ అభ్యర్థి యల్లమిల్లి రవికుమార్‌కు 1,429, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు 844, నవోదయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు 1,091, ఇండియా ప్రజా బంధు పార్టీ అభ్యర్థి మేగా వెంకట్రావుకు 223,



రాజానగరం ఎమ్మెల్యేగా బత్తుల బలరామకృష్ణకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి చైత్రవర్షిణి



జి.మామిడాడలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

జై భారత్ పార్టీ అభ్యర్థి పి.సత్యనారాయణకు 350, స్వతంత్ర అభ్యర్థులు బర్రే ఆనంద కుమార్‌కు 874, గంధి కుసుమ కుమారికి 526 ఓట్లు లభించాయి. ఈ ఎన్నికలో అత్యధిక ఓట్లు పొందిన జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను విజేతగా ప్రకటిస్తూ రిటర్నింగ్ అధికారి ఎ. చైత్రవర్షిణి ఎన్నికల ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.

ఎంపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

రాజానగరం: రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్లమెంటు అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఈ విధంగా ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరికి 97,157, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కి 66,977, గణేశ్వరావు పరమటకు 4,378, గిడుగు రుద్రరాజుకు 3,007, బత్తుల బలరామకృష్ణకు 10,342, మేడా శ్రీనివాసరావుకు 736, మోహనరావు సింగులూరికి 257, జల్లి బాల నవీనకు 240 ఓట్లు, బొమ్మన అభినయ వీఎస్ఆర్ మూర్తికి 412, డాక్టర్ మేడిసి రత్నారావు (వినయ్)కు 749, సోలాపంతుల రాఘవేంద్రరావుకు 583 ఓట్లు వచ్చాయి.

అభ్యర్థులకు లభించిన ఓట్ల వివరాలు ఇలా..

అభ్యర్థి	సాధించిన ఓట్లు
నల్లమిల్లి రామకృష్ణారెడ్డి	1,04,705
డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి	84,138
వై.శ్రీనివాసరావు	1276
కె.శ్రీను	306
కె.శివానంద్‌రెడ్డి	289
గంగాధర్ లింగం	269
ఎస్‌కే సర్దార్ హుస్సేన్	284
సీహెచ్ శ్రీను	275
పిసరెడ్డి	327
నోటా	3,093
మొత్తం	1,94,962

రౌండ్ల వారీగా..

రౌండ్	నల్లమిల్లి రామకృష్ణారెడ్డి	డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
1	5,460	5,574
2	6,072	5,991
3	5,793	6,152
4	5,903	6,749
5	6,167	5,290
6	6,454	5,487
7	6,316	5,174
8	6,335	4,755
9	7,048	5,044
10	7,242	4,658
11	7,275	5,077
12	7,602	4,738
13	6,499	4,293
14	5,277	5,204
15	6,294	4,592
16	6,752	3,981
17	2,216	1,379

మట్టి ట్రాక్టర్ల జోరు.. ప్రజల బేజారు



కంసాలిపాలెంలో ట్రాక్టర్‌పై తరలిస్తున్న మట్టి

- రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్న జనం
- ఛిద్రమవుతున్న రహదారులు
- అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు

నిడదవోలు రూరల్: అధికారులు సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో బిజీగా ఉన్నారు. ఇదే అదనుగా మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రెవెన్యూ అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో అక్రమార్కులు రైతుల నుంచి మట్టిని కొనుగోలు చేసి మట్టి దందా సాగిస్తున్నారు. దాళ్వా పంట ముగిసిన వెంటనే రైతులు వేసవి సీజన్‌లో తమ పొలాల్లో మెరక, పల్లాల పనులు చేపడుతున్నారు. గతంలో కూలీలు, ఎడ్లబండ్ల సాయంతో ఈ పనులు చేసేవారు. ప్రస్తుతం కూలీల కొరత వల్ల జేసీబీ, పొక్లెయిన్‌ల సాయంతో ఈ పనులు చేపడుతున్నారు. ఇలా రైతుల నుంచి సేకరించిన మట్టిని కొందరు ఇటుక బట్టీలకు కూడా అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇరుకు రహదారులపై మితిమీరిన వేగంతో మట్టి ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ ట్రాక్టర్ల వేగానికి జడిసి గ్రామీణులు రోడ్డుపైకే రావాలంటేనే హడలిపోతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భీతిల్లుతున్నారు. అతివేగం వల్ల కనురెప్ప పాటులో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. దీంతో మృతుల కుటుంబాలు శోక సంద్రంలో మునిగి పోతున్నాయి. లాభాలే ధ్యేయంగా కొంతమంది ఇష్టారాజ్యంగా చేస్తున్న మట్టి తరలింపు సామాన్యులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. నిడదవోలు మండలంలోని కంసాలిపాలెం, రావిమెట్ల, శెట్టిపేట గ్రామాల్లో ప్రస్తుతం మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ అధికారుల ఉదాసీనత వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అనుభవం లేకుండానే..

మట్టి తరలింపునకు ప్రభుత్వ శాఖల అనుమతులు ఉండవు. ఆ వాహనాలు నడిపే డ్రైవర్లకు మోటార్ వాహన చట్టం ప్రకారం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు కూడా ఉండవు. కొంతమంది పెద్దల పలుకుబడితో అడిగేవారు లేరని రెచ్చిపోతున్నారు. ట్రిప్పుల లెక్కన మట్టిని తరలించి, జేబులు నింపుకుంటున్నారు. ఎక్కువ ట్రిప్పులు వేసుకుంటే, ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడుపుతున్నారు. దీనికి తోడు మట్టిని తరలించే వాహనాలకు పెద్దపెద్ద శబ్దాలతో సినిమా పాటలు పెట్టుకుంటారు. ఇది చాలదన్నట్టు కొందరు డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తారు. మరికొందరైతే ఇయర్ ఫోన్ల ద్వారా సెల్ ఫోన్లలోని పాటలు వింటూ వాహనాలు నడుపుతున్నారు. కంసాలిపాలెం గ్రామంలో రాత్రి వేళల్లో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు.

మట్టి తవ్వకానికి పాటించాల్సిన నిబంధనలు..

- మట్టిని తవ్వుతున్న ప్రాంతం నుంచి తరలించే వరకూ ఎక్కడా ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు ఉండకూడదు.
- వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వి తరలించాలంటే రెవెన్యూ శాఖ అనుమతి తప్పనిసరి.
- ఎత్తుగా ఉన్న మెరక భూముల నుంచి మట్టిని తరలించాలంటే గనుల శాఖకు దరఖాస్తు చేసుకుని సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందాలి.
- మోటార్ వాహన చట్టం ప్రకారం మట్టి తరలించే వాహనానికి అన్ని అనుమతులూ ఉండాలి. డ్రైవర్‌కు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలి.
- వాహనంలో తరలించే మట్టిగడ్డలు బయటకు కనిపించకుండా దానిపై బరకాలు కప్పి తరలించాలి. మట్టి రవాణా వల్ల రహదారులు దెబ్బతింటే సంబంధిత అధికారులు వాటిపై చర్యలు తీసుకోవచ్చు.
- భూమి మార్పిడి కోసం రైతులు తప్పనిసరిగా రెవెన్యూ శాఖ అనుమతులు తీసుకోవాలి.

ఈత పండు.. రుచి మెండు



ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్న ఈత పండ్లు

రంగంపేట: సీజన్ల వారీగా ఎన్నో రకాల పండ్లు అందుబాటులోకి వస్తుంటాయి. ప్రకృతి ప్రసాదించిన అటువంటి పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తాయి. వేసవిలో విరివిగా పుచ్చకాయలు, తాటి ముంజెలు, మామిడిపండ్లు, సపోటా ఇలా అనేక రకాల పండ్లు కనిపిస్తుంటాయి. ఆ కోవలోనే ఈత చెట్ల నుంచి వచ్చే ఈత పండ్లు కూడా ఉన్నాయి. ఈత పండ్లలో పోషక విలువలు పుష్కలంగా ఉన్నాయి. పిండి పదార్థాలు, చక్కెర, పీచు పదార్థం, కొవ్వు, మాంసకృతులు, విటమిన్-సి ఉండటంతో వేసవిలో ఈ పండు తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి. ఈత పండ్ల ద్వారా ఈత బెల్లం కూడా తయారు చేస్తారు. బెల్లానికి కూడా మంచి డిమాండ్ ఉంది.

ఏడీబీ రోడ్డులో విక్రయాలు

ఇంతటి మధురమైన పండ్లను చిరు వ్యాపారులు ఏడీబీ రోడ్డులో విక్రయిస్తున్నారు. ఈత గెలలను, ప్యాకెట్లలో ఈత పండ్లను అమ్ముతున్నారు. గెల మొత్తం కొంటే రూ.100 నుంచి రూ.150కు, ప్లాస్టిక్ కవర్లో రూ.20కు విక్రయిస్తున్నారు. ఏడీబీ రోడ్డులో కార్లు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు వీటిని కొనుగోలు చేస్తున్నారు.



నోరూరిస్తున్న ఈత పండ్లు

సాయికృష్ణకు డాక్టరేట్ ప్రదానం

నల్లజర్ల: స్థానిక ఏకేఆర్జీ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు నల్లజర్ల సాయికృష్ణకు విశాఖ పట్టణానికి చెందిన గీతమ్స్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జీర్ణకోశ వ్యాధులైన హెమరాయిడ్స్‌పై పరిశోధనా వ్యాసం సమర్పించినందుకు గాను తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు నల్లజర్ల సాయి కృష్ణ మంగళవారం తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

ఖరీఫ్ ఆకుమడులు సిద్ధం



చినకొండేపూడిలో దంప వరి ఆకుమడి

సీతానగరం: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌కు ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఆయకట్టులో 14 వేల ఎకరాలు ఉండగా, అనధికారికంగా మరో ఆరు వేల ఎకరాలు సాగవుతోంది. మోటార్లు ఉన్న పొలాల్లో ఇప్పటికే ఆకుమడులు వేశారు. ఇందులో మెట్ట ఆకుమడులు, దంప ఆకుమడులు ఉన్నాయి. మెట్ట ఆకుమడులు దుక్కు దున్ని వరి విత్తనాలు వేసి నీరు పెడుతూ ఉంటారు. దంప ఆకుమడులు దుక్కు దున్నిన అనంతరం దమ్ము చేసే విధంగా ఆకుమడులు తయారు చేసి విత్తనాలు జల్లి ఆకుమడి తడి ఆరకుండా నీటిని పెడుతుంటారు. మోటార్ల వద్ద నీరు అందుబాటులో ఉంటుంది కనుక రైతులు దంప మడులు వేస్తారు. మెట్ట ఆకుమడులు నీరు అందుబాటులో లేని దూర ప్రాంత పంటపొలాల్లో వేస్తారు. ఇప్పటికే దంప మడులు రైతులు వేశారు.

మండలంలో సుమారు ఐదువేల ఎకరాలకు సరిపడా వరి ఆకుమడులు వేశారు. జూన్ 15 దాటిన అనంతరం మెట్ట ఆకుమడులు వేస్తారు. రైతులు సాంబమసూరి, పీఎల్ రకం వరి వంగడం ఎక్కువగా వేస్తారు.

మెట్టలో ఖరీఫ్ వరినాట్లు ప్రారంభం

- సాగుకు రైతుల సన్నద్ధం
- అనుకూలిస్తున్న వాతావరణం

రాజానగరం: నైరుతి రుతుపవాల ప్రభావంతో కురుస్తున్న తొలకరి జల్లులు ఖరీఫ్ సాగుకు అన్నదాతలను సమాయత్తం చేస్తున్నాయి. ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయంలో తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్న తుపానుల తాకిడి తగలకుండా సకాలంలో సాగు చేపట్టాలని రైతులను వ్యవసాయాధికారులు చైతన్యపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణం కూడా అనుకూలించడం వారిలో మరింత ఉత్తేజాన్ని కలిగిస్తోంది. సీజన్ ఏదైనా తమదే ముందడుగు అనే మెట్ట రైతుల బాటలోనే డెల్టాలో కూడా అన్నదాతలు ఖరీఫ్ సాగుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకునే పనులను అధిగమించి, నార్లు వేయడంలో బిజీగా ఉన్నారు. బోర్లు ఉన్న రైతులు మాత్రం ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. అయితే ఈ సమయంలో స్థానికంగా కూలీ కొరత రైతాంగాన్ని వేధిస్తున్నా, ఆ లోటును భర్తీ చేస్తూ బెంగాలీ కూలీలు సాగులో చురుకైన పాత్రను పోషిస్తున్నారు.

సాగుకు శ్రీకారం

సాగునీటి సదుపాయాలు సమృద్ధి లేకపోయినా, గొట్టపు బావుల సదుపాయంతో రాజానగరం, గండేపల్లి, రంగంపేట, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి, బిక్కవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి ప్రాంతాలలో రైతులు ఖరీఫ్ వరిసాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పలుచోట్ల వరినార్లు వేసి ఉండటంతో నాట్లు వేయడం ప్రారంభమైంది. ముఖ్యంగా రాజానగరం మండలం నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెంలలో వారం రోజులుగా వరి నాట్లు వేయడంలో రైతాంగం ముమ్మరంగా ఉంది. అయితే స్థానికంగా కూలీల కొరత ఉన్నప్పటికీ ఆ లోటును బెంగాలీ కూలీలు ఏడు సంవత్సరాలుగా భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడకు చేరుకున్న బెంగాలీ కూలీలు ద్వారా మెట్ట ప్రాంతాల్లోని పొలాలలో వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

క్రమపద్ధతిలో వరినాట్లు

బెంగాలీ కూలీల వరినాట్లు వేసే విధానం ఒక పద్ధతిలో ఉంటూ వ్యవసాయాధికారులను ఆకట్టుకుంటుంది. వరినారు తీయడం, క్రమపద్ధతిలో నాట్లు వేయడమంతా మగకూలీలే చేస్తారు. ఇందుకు ఎకరానికి రూ.3500 తీసుకుంటారు. దీని వల్ల ఖర్చులు, సమయం ఆదా కావడంతో పాటు ఒకటి, రెండు మొక్కలనే తీసుకుని నాటడం వలన దుబ్బులు బాగా చేసి, దిగుబడులు కూడా బాగుంటున్నాయని రైతులు అంటున్నారు. నెలాఖారునాటికి మిగిలిన ప్రాంతాలలో కూడా వరి నాట్లు వేయడం ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. పలు ప్రాంతాలను సందర్శిస్తూ వస్తున్న అధికారులు నార్లు వేయడం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం, వరి నాట్లు వేయడం తదితర వాటిలో రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.



సీతానగరంలో వరి నారును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



నరేంద్రపురంలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

చురుగ్గా సాగు పనులు

మెట్ట ప్రాంతంలో బోర్లు అధికంగా ఉన్న రాజానగరం పరిసర ప్రాంతాలలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన ప్రాంతాలలో నారుమడులు కడుతున్నారు. నెలాఖరు నాటిని పూర్తిస్థాయిలో నారు సిద్ధం కావడమే కాకుండా నాట్లు వేయడం కూడా వేగవంతం అవుతుంది. ప్రస్తుతం నైరుతి రుతు పవనాలు ప్రారంభించి, అడపాదడపా వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతాంగం సాగు పనుల్లో బిజీగా ఉంది. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నాం.

– ఎస్. మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి